


పిల్లల బొమ్మల పత్రిక

పిల్లల బొమ్మల పత్రిక

# బాల

సంవత్సరం చందా రు. 4-8-0 మాత్రమే.

విడిపత్రిక 6 అణాలు.

.......

కావలెను!

ఆంధ్రదేశములో
ప్రతి ఊరిలోనూ
ప్రతి పల్లెలోనూ

"బాల" కు

ఏజంట్లు కావలెను.

వివరములకు :

మేనేజరు, "బాల"

20, సుందరేశ్వర్ వీధి, మైలాపూరు, మదరాసు.

Read '**BALA**', the most popular
Children's Magazine,

20, Sundareswar Street, Mylapore, Madras.

## త్వరలో వచ్చుచున్నది!

శ్రీ రేణుకావారి భక్తిరసపూరితమగు చిత్రరాజము !!



[illegible]

# త్యాగయ్య

డైరక్షన్ :- నాగయ్య

: తారాగణము :

జయమ్మ, సరిత, హేమలత, లింగమూర్తి, రాయప్రోలు,
న్యాపతి, దొరసామి, రాఘవన్, ప్రయాగ

: నిర్మాతలు :

## శ్రీ రేణుకా ఫిలింస్ లిమిటెడ్

16. డాక్టరు నాయర్ రోడ్, మద్రాస్.



*World Rights Controlled by:*

**CHANDRALEKHA FILMS, MADURA**




సంపాదకుడు : న్యాయపతి రాఘవరావు, బి.ఎ.

సహాయ సంపాదకులు : న్యాయపతి కామేశ్వరి, బి.ఎ., ఎల్.టి.

సంపుటి 1.] మదరాసు, మార్చి, 1946 [సంచిక ౧.

# ఎన్నికలూ -- ఓట్లూ

మనం కొన్నికొన్ని చిన్నపనులు మనం ఒక్కళ్ళం చేసుకోగలం. కాని పెద్దపని ఏదైనా చేయాలంటే, మనకి ఇతరుల సహాయం కావాలి.

ఒకదేశానికి ఒక రాజు వున్నాడనుకుందాం. ఆ రాజు తన రాజ్యం ఒక్కడూ నడపగలడా? రాజ్యంలో బడులు, ఆసుపత్రులు, రోడ్లు, రైళ్ళు, తపాలాఫీసులు - ఇంకా ఎన్నెన్నో పెట్టించాలి. ఎన్నోపనులు చేయించాలి; ఈ పనులన్నీ చేయించడానికి మంత్రుల సహాయం కావాలి. మంత్రులు మంచివారైతేనే రాజ్యం బాగా జరుగుతుంది.

పూర్వం రాజులు తమకి ఇష్టంవచ్చిన మంత్రులనే వేసుకొనేవారు. కాని ఇప్పుడు ఆ పద్ధతి మారిపోయింది. ఇప్పుడు మంత్రులని ప్రజలే ఎన్నుకుంటారు.

"ఎన్నిక" అంటే ఏమిటో తెలుసా?—"ఫలానావాడు మంత్రిగా వుండాలి" అని ప్రజలు కోరుకుంటారు. అయితే, కోరిక తెలియచేయడం ఎలాగ? దానికి "ఓటు" చేయడం అని ఒక పద్ధతి పెట్టారు. "ఓటు" అంటే, మన అభిప్రాయం (ఒక కాగితంమీద) తెలియజేయడం. "నేను మంత్రిగా వుంటాను, నేను మంత్రిగా వుంటాను; నన్ను ఎన్నుకోండి, నన్ను ఎన్నుకోండి"—అని పదిమంది పోటీతగులుతే అందులో మంచివాడిని ఎంచి మనం వ్వారికి మన "వోటు" ఇస్తాం. ఎవరికి హెచ్చుగా వోట్లు వస్తే వాళ్లు మంత్రులుగా ఎన్నుకోబడుతారు.

ఇప్పుడు మన రాజధానిలో ప్రజల రాజ్యం పెట్టడానికి ఎన్నికలు జరుగుతున్నాయి. మంచివారికే "ఓట్లు" బాగావచ్చి, ఎన్నికలలో గెలుస్తారని నమ్ముదాం.



"బాల" ఉగాది సంచిక

కొత్త సంవత్సరపు

పాటలతోటీ, ఆటలతోటీ వస్తోంది!

వెల 6 అణాలే.

# బాలరాజ్యం



ఈ "బాలరాజ్యం" మనది. ఈ రాజ్యం మనమే ఏలుకోవాలి. ఈ రాజ్యం బాగా నడపడానికి మనకి మంత్రులు కావాలి. ముఖ్య మంత్రి ఒకరు; ఉపమంత్రి ఒకరు కావాలి. మంత్రులను మనమే ఓట్లిచ్చి ఎన్నుకోవాలి. మన బాలరాజ్యానికి మంత్రులుగా వుంటామని నలుగురు పోటీ నిలుచున్నారు. వాళ్లు ఎవరో తెలుసా?— మన రామూ, సోమూ, సరళా, విరళా. వాళ్లు ఏమిటిచెప్తారో పేజీ తిప్పి చదవండి.



# రాము

స్నేహితులారా !

నా మనవి వినండి. నా గురించి మీకందరికీ బాగా తెలుసును.

నా అలవాట్లు, నా చదువు, నా నడవడిక, నా చరిత్ర మీరు "బాల" పత్రికలో చదివే వున్నారు. నన్ను గురించి నేను వేరే చెప్పుకో అవసరంలేదు.

మీ ఓటు నాకు ఇస్తే నేను, మన "బాలరాజ్యం" లో,

1. పిల్లలందరికీ బాగా చదువువచ్చేటట్టు;
2. అందరూ హాయిగా, ఆరోగ్యంగా వుండేటట్టు;
3. ప్రతి ఇంట్లోనూ 'బాల' పత్రిక తెప్పించేటట్టు తగిన ఏర్పాట్లు చేయిస్తాను.

మన 'బాలరాజ్యం' ప్రపంచంలో అన్నిరాజ్యాలను మించి, గొప్పకీర్తి పొందేటట్లు చేస్తాను.

కనుక నాకే మీ ఓటు ఇయ్యండి.



# సోము



బాల బాలికలారా !

నా మనవి వినండి. నన్ను గురించి ఎవరో కిట్టనివారు, నేను ఆలశ్యంగా లేస్తానని, నీళ్లుపోసుకోనని, బడికి సరిగా వెళ్లనని, వీధుల్లో తిరుగుతాననీ ఇంకా ఏవేవో చెడ్డగా రాశారు.

నేను బడి మానివేయడం ఎందుకు?—మనం బాలరాజ్యంలో వున్న వీధులన్నీ తిరిగి, ఎక్కడెక్కడ ఎటువంటి మంచిచెడ్డలున్నాయో అన్నీ తెలుసుకుందుకు. నేను నా ఒంటిశుభ్రతకూడా లెక్కచేయక, దేశంకోసం పాటుపడగలను. బడి పుస్తకాలు చదవకపోయినా నేనుకూడా "బాల"ను చదివి ఎంతో జ్ఞానం సంపాదించాను. "బాల" అంటే నాకుకూడా ఎంతో అభిమానము.

కాబట్టి, లోకజ్ఞానంకలిగి, కష్టపడి దేశసేవ చేయుటకు సిద్ధంగావున్న నాకే మీ ఓటు ఇయ్యండి.





# సరళ

సోదర సోదరీమణులారా !

నేను, మన 'బాలరాజ్యం' లో ఒక మంత్రిపదవికి పోటి నిలచేను. బాలికలుకూడా ఇకముందు రాజ్యపరిపాలన చేయాలని నా మనవి.

నాగురించి మీకందరికీ బాగా తెలుసును. నేను మా ఇంట్లో అందరికీ పనులలో సహాయం చేస్తున్నాను. ముందు ఇంట్లో నేర్చిన పద్ధతులే తరవాత రాజ్యం ఏలడానికి పనికి వస్తాయి.

నన్ను మీరు ఎన్నుకొన్నట్లయితే, నేను.

1. బాలసంఘాలు ఎక్కువగా పెట్టిస్తాను.
2. ప్రతీగ్రామములోనూ బడులు పెట్టిస్తాను.
3. ఆడపిల్లల అభివృద్ధికి ఎంతేని పాటుపడతాను.

కనుక మీరందరూ మీ ఓటు నాకే ఇమ్మని ప్రార్థిస్తున్నాను.



# విరళ



ఏమర్రా నా మనవి వినండి!

నేను శుభ్రంగా ఉండనని, ఇంట్లో పనంటే పారిపోతాననీ, గయ్యాళి గంపనని, ఇలాగ ఏవో కొందరు అనుకుంటున్నారని నాకు తెలిసింది. కాని, ఆ మాటలను నేను లక్ష్యం చేయను.

నేను ఇంట్లో కూచొనే 'అమ్మ కూచమ్మను' కాను. ఆడవారు దేశం పరిపాలించాలంటే మొగవాళ్లతో సరిసమానంగా పోరాడే శక్తివుండాలి. అందుచేత, నేను ఇంటిపనులు మాని, లోకజ్ఞానం సంపాదించుతున్నాను.

నేను ఎప్పుడూ ఆటలు ఆడుతున్నానని ఒక నింద ఉంది. ఇకముందు ఆటలతోనే చదువు నేర్పే పద్ధతులు వస్తున్నాయి. నాకు మీ ఓటు ఇస్తే ఇంటింటా ఆటవస్తువులు, బొమ్మలు, పాటలతో నింపేస్తాను. కనుక నాకే మీ ఓటు!



# "ఓటు" ఇయ్యడం ఎలాగ?

ఈ దిగువన ఓటు కాగితం వుంది. అందులో నాలుగు పేర్లు వున్నాయి. పేరుకి ఎదురుగావున్న గడిలో ╳ యీ గురుతు పెట్టాలి. ఎవరిపేరు ఎదురుగా మీరు ╳ గురుతు పెడితే వారికి మీ "ఓటు" ఇచ్చినట్టు. మీరు, ఒక మొగమంత్రి, ఒక ఆడ మంత్రీ - ఇద్దరు మంత్రులనే ఎన్నుకోవాలి. ఓటుకాగితం వేరే తెల్లకాగితం మీద ఇలాగే రాసి పంపవచ్చును. ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో, ఎవరుగెలిచారో, ఒచ్చేనెల 'బాల' లో వేస్తాం.

ఓ టు కా గి త ం

| | |
|---|---|
| రాము | |
| సోము | |

| | |
|---|---|
| సరళ | |
| విరళ | |

మీ 'ఓటు' కాగితం మాకు మార్చి 28 తేదీలోపుగా చేరాలి.



చీకటిని లేచింది
కంఠమును ఎత్తింది
తొలికూత కూసింది
పెద్దలను లేపింది
మరుకూత కూసింది
పిన్నలను లేపింది
పెద్దలందరు గూడి
పనుల కేళ్లారు
బాలులందరు గూడి
బడుల కేళ్లారు

రచన : డి. వి. జగన్నాధరావు,
(విజయనగరము)

# ఆరోగ్యవాచకము

## మొదటి తరగతి

[అన్నిహక్కులూ రచయితవి]



## నిద్ర

నిలుపకు నిలుపకు నిద్దుర రాతిరి
ప్రొద్దు పొడుచుటకు పూర్వమె లెమ్ము
పగటి వేళలో పండగ రాదు
పండిన వ్యాధులు మెండుగ వచ్చు.

రచయిత:

డాక్టరు పోలాకి శ్రీనివాసరావు,

బూరవెల్లి.



# చెల్లీ — అన్నా

చెల్లెలు:—లే! లే! లేలే!

అన్న:—(నిద్రలోనే) ఊఁ!—ఊఁ!!—ఊఁ!!!—

చెల్లి :—అన్నా! ఎందుకు బజ్జున్నావు?

అన్న:—కంటికి నిద్దుర కమ్ముచునుండె.

చెల్లి :—ఱెప్పలు వడిగా విప్పిచూడుము

అన్న:—తెల్లవారితే తేరిచూచెదను.

చెల్లి :—వేకువ గాదిది వెఱ్ఱన్నయ్యా!

అన్న:—ప్రొద్దు తూరుపున పొడిచినలేతు

చెల్లి :—ప్రొద్దు పడమరకు పోవుచునున్నది.

అన్న:—పగటిపూటనే పడుకున్నానా?

చెల్లి :—లేచి బయలులో జూచినతెలియు

అన్న:—(లేచి) నిజమే చెల్లీ! నిజమేనే!

చెల్లి :—అందుకె వ్యాధిని పొందుచునుంటివి.

అన్న:—నిజమే చెల్లీ! నిజమేనే!

చెల్లి :—పగలు పరుండిన వ్యాధులు వచ్చు

అన్న:—పగటివేళ నిక పరుండ చెల్లీ!

రచన : డాక్టరు. పోలాకి శ్రీనివాసరావు,

బూర్జవెల్లి.

# బుల్లెమ్మ తప్పిపోయింది!

రచన: "యతిరాపతి"

ఒకనాడు ఆ యింట్లో గొప్ప ఉపద్రవం జరిగింది! బుల్లెమ్మ కనబడటం లేదు.

గోపాలరావు బడినుండి యింటికి రాగానే వాళ్ళ అమ్మ "బుల్లెమ్మ యేదిరా?" అంటూ ఎదురయింది.

"అబ్బే, నాకు తెలియదు. మధ్యాహ్నం భోజనంచేసినప్పుడు చూడటమే—తరువాత చూడలేదు."

"అయితే, యింకా బడినుండి వచ్చేదారిలో ఆలస్యమై వుంటుంది. మామూలుగా మీకంటె ముందుగానే వచ్చేది. ఇవేళ చేగోడీలుకూడా చేశాను. వేగం రమ్మనిచెప్పాను—బడికి వెళ్లి చూచిరారా, బాబూ"

"సరే" నని గోపాలరావు బడికి తిరిగీ వెళ్లాడు. అన్ని తరగతుల గదులూ మూయబడి వున్నాయి. ఇంటికి వేగంగా పోయాడు—యీలోగా వచ్చిందేమోననే ఆశతో. కాని బుల్లెమ్మ యింకా కనుపించలేదు.

ఆ కుటుంబమంతా గాభరా పడ్డారు.

బుల్లెమ్మ అన్నలు ముగ్గురూ అన్ని వీధులూ వెదకడానికి బయలుదేరారు. చుట్టాల యిళ్ళల్లో వెదికారు—అబ్బే, ఎక్కడా కనుపించలేదు!

వారింటికి వచ్చేసరికి వాళ్ళ నాన్నగారు కోటు విప్పుతూ, "ఏమర్రా, దొరికిందా" అని అడిగారు.

ముగ్గురూ ఒకరి మొగాలొకరు చూచుకున్నారు.

"సరే, నేను పోలీసు స్టేషనుకు పోయి 'రిపోర్టి'స్తాను...'

ఇంతలో మేడమెట్ల మీద నుండి అడుగుల చప్పుడు వినబడ్డది. ఎవరా అని చూచారందరూ.

మెల్లగా తన చిన్న చేతుల్తో పరికిణీ సర్దుకుంటూ దిగింది బుల్లెమ్మ.

"ఇంతసేపటినుండీ ఎక్కడికి వెళ్ళావు?" అన్నారు వాళ్ళనాన్న.

"మేడమీదకి."

"ఎందుకే? ఏం చేస్తున్నా వింతసేపూ?"

"బొమ్మలకు రంగు వేస్తున్నా"

"రంగు లెక్కడివీ?"

"మొన్న మామయ్య యిచ్చాడు కాదూ?"

పాపం, రంగులు వేయడం సర



దాలో అన్నీ మరచిపోయింది- అమ్మ యిస్తానన్న చేగోడీలు కూడా!

"అరె, మేడమీద చూడలేదురా!" అన్నాడు వేణు.

"పోనీ, పిలవనైనా లేదు గట్టిగా" అన్నాడు శేషు.

"యెప్పుడు మీదకి వెళ్ళిందో గమ్మత్తుగా!" అంది అమ్మ.

"రండర్రా, నా బొమ్మని చూద్దురు గాని." అంటూ చేతులుపట్టుకు లాగుకుపోయింది తప్పిపోయిన బుల్లెమ్మ!


54-వ పేజీలోని పొడుపు కథలకు జవాబులు :

1. తాటిచెట్టు, తాటిఆకులు, తాటిముంజలు : 2. త్రాసు; 3. నీడ; 4. చీపురు.



బొజ్జి ఎలుక బొజ్జి ఎలుక
ఎక్కడ కెళ్లావు?
బాబుగారిని చూడడానికి
బొంబాయి వెళ్లాను!
బొజ్జి ఎలుక బొజ్జి ఎలుక
ఏం చేశావు?
బాబుగారు పెట్టినట్టి
బోనులో పడ్డాను!

—బొల్లాప్రగడ వీరవెంకట రామసుబ్బారావు, (సీతానగరం)



# అందాలు

కాకర పాదుకు కాయలందమ్మా
శ్రీకృష్ణతమ్మునికి తిరుమణందమ్మా
మల్లె పందిరికి మొల్లలందమ్మా
బీరపాదులాకు పువ్వులందమ్మా
ఆడువారికి ముక్కు పుడకలందమ్మా


# కన్నతల్లి

ఉన్న ఊరూ విడిచి ఉండనేలేము
కన్నతల్లిని విడిచి ఘడియుండలేము
ఉన్న వూరూ నాకు చెన్నపట్నమ్మా
కన్నతల్లీ నాకు కల్పవృక్షమ్మా

సంపాదన : చింతా దీక్షితులు

# రైలు

# బండి




రచన : గిడుగు సీతాపతి

మదిలో పుట్టిన ఊహలకంటే
మంటలలేచిన పొగ సుడికంటే
వడివడిగా
దడదడగా
మన పొగ బండీ
మన రైల్ బండీ
జఫ్ జఫ్—జజజఫ్
జజజజ—జజజఫ్
పరుగిడుతున్నది పరుగిడుతున్నది
మరియొక స్టేషన్ వస్తూవున్నది

* * *

దెబ్బలు తగిలిన దయ్యమువలెనే
దేవత పంపిన దూతలవలెనే




తరతరగా
బిరబిరగా
చెట్లూ చేమలు
చెరువులు పుట్టలు
ఏళ్లూ కొండలు

వెనుకకు వరుసగ పరుగిడుతున్నవి
మన ఇఁక చూడఁగ కనబడకున్నవి

*   *   *

బూచిని చూచిన పిల్లలవలెనే
ముంగిని చూచిన పాములవలెనే
తొ ం ద ర గా
స ం ద డి గా
వ స్తూ ఉ ం డే
బ ం డీ తే త్త ర .
అ గ ప డి న ం త నె
ఆ వు ల మ ం ద లు
బెదరిపోయి నలు దిక్కుల గబగబ
చెదరిపోవుచూ పరుగిడుతున్నవి.

*   *   *



మెరసిన మెరుపులు కనబడునట్లే
విరిగిన కెరటము పోయిన యట్లే
అ ది గ ది గో
ఇ ది గి ది గో
అదిగో వంతెన
అగపడుతున్నది
ఇదిగో వంతెన
ఇక్కడ నున్నది
కనబడదేమీ వచ్చిన వంతెన?
[illegible]



# దొంగాట

దొంగాట - దొంగాట - దోబూచులాట
ఆడుకుంటాం - మేము - ఆడుకుంటాము!

అక్కల్లు - చెల్లెళ్లు
అన్నల్లు - తమ్ముళ్లు
బావల్లు - మరదళ్లు
యిరుగు పొరుగులవాళ్లు

అందరము కలిసి మేమాడుకుంటాము.
దొంగాట - దొంగాట - దోబూచులాట!

'తల్లెవ్వరుంటారు - ఆటలో - తల్లి ?'
'పోలవరపూవారి పూర్ణమ్మ - తల్లి.'
పూర్ణమ్మ వచ్చింది - గడపలో కూర్చుంది.

"నాలుగు స్తంభాలాటకి - నడిమికి - తొడిమికి
తప్పక తన పేరేమంటే - ఉట్టిమీద బెల్లం
పొట్టి - కాకర - సీసర —
కొబ్బెర - తలకట్టు!" —
'నేనుపంట' - 'నేను పంట—'
'నేను పంట' - 'నేనూ పంటే!'
'ఎవరు దొంగ?'
'తోరణాలవారి దొండయ్య - దొంగ!'
'దొండయ్య దొంగ!' - 'ఆ దొండయ్య దొంగ!'
'సైయ్యాఁ?' - 'ఇంకా లేదు'
'తల్లిదగ్గిర దాగుంటేను -
తట్టెడు మన్ను తిన్నట్టు!
'సైయ్యాఁ?' - 'ఆఁ - సైఁ - సైఁ!'
'అవసరాలవారి అంకమ్మ ఓటు!'
'బట్ట చాకలిదైతే, - ఏలాగు నే నోటు?'
'గొట్టుముక్కులవారి గునయ్య ఓటు!'
'జుట్టు మంగలిదైతే - ఏలాగు నే నోటు?'
దొండన్న యింతలో దొర్లిపడ్డాడు -
మురికి కాలువలోను విరగపడ్డాడు -
'తువ్వారి - బొడ్డుంబాల్'
'నాపేరు ఆకాశం!'
'నాపేరు సూర్యుడు!'
'నాపేరు చంద్రుడు!'
'నేను స్వర్గలోకం?'
'నేను స్వర్గలోకం లోని యింద్రుణ్ణి!'

'నేనా యింద్రుడి తలమీది కిరీటాన్ని!'
'నేనా కిరీటంలోని మాణిక్యాన్ని!'
'నేనా మాణిక్యంలోని ధగ ధగని!'

దొండన్న లేచాడు - దొండన్న.
మరల పరుగెత్తాడు - దొండన్న

దడ దడ దడ దడ గుర్రపు దాట్లు - 'తల్లి!'
చక చక చక చక జట్కాబండి - 'తల్లి!'
గుఫ్ గుఫ్ గుఫ్ గుఫ్ కల్కటా మెయిల్ - 'తల్లి!'

చల్లగా అందరూ తల్లినీ తాకేరు—
పూర్ణమ్మ ప్రక్కలో మెల్లగా చేరేరు—
ఏడుపు మొగముతో దొండన్న—
మళ్లీ దొంగ - దొండన్న!

"కాకాజీ"


మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే
పాత్రుడుగారి
# బాలసంజీవిని
యీయండి
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.
వివరములకు :—
డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,
11. దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకొలం.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| | 9 | 8 | 7 | 6 | 5 | 4 | 3 | 2 | 1 |
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| | 9 | 8 | 7 | 6 | 5 | 4 | 3 | 2 | 1 |
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| | 9 | 8 | 7 | 6 | 5 | 4 | 3 | 2 | 1 |
| | | | | | | | | | 3 |
| 3 | 3 | 3 | 3 | 3 | 3 | 3 | 3 | 3 | 3 |

పంపినవారు : కురుమద్దాలి రామచంద్రమూర్తి శర్మ

బెజవాడ

## ఈ అంకెలు చూడండి !

9 × 9 + 7   88

9 × 98 + 6 = 888

9 × 987 + 5 = 8888

9 × 9876 + 4 = 88888

9 × 98765 + 3 = 888888

9 × 987654 + 2 = 8888888

9 × 9876543 + 1 = 88888888

9 × 98765432 + 0 = 888888888

పంపినవారు : కుచ్చు సుబ్రహ్మణ్యం.

# అక్షరాభ్యాసం



పన్నాల అన్నయ్య

"రాధయ్! నువ్వు చాలా తెలివైన వాడివిరా!'' అనండి!- కర్రుచ్చుకు తన్నడానికి మీది కొస్తాడు రాధాయి.

నిజంగా రాధాయి ఎంతో తెలివైనవాడు. అందుకే, ఆ విషయం వాడికి జ్ఞాపకం చేస్తే పౌరుషం.

వాళ్ల నాన్నగారు చేసే పనులన్నీ వాడికి చెయ్యాలని కుతూహలం. టేబిలుదగ్గర కూర్చుని, వాళ్ల నాన్నగారు ఆఫీసు పని చేసుకోవడం శ్రద్ధగా చూస్తాడు. నాన్నగారు ఎక్కడికేనా వెళ్లటం చూసి, ఆ కుర్చీమీద తను కూర్చుంటాడు. వాళ్ల నాన్నగారు రాసుకున్న గితాలమీద తనూ రాయడం ప్రారంభిస్తాడు.

అయితే రాధాయికి అప్పటికి ఇంకా అక్షరాభ్యాసం కాలేదు. అందుచేత వాడు రాసినవి అక్షరాలల్లే వుండవు. అవేవో కొన్ని గీతలు వస్తాయి. మధ్యమధ్య కొస్త సిరా మ ద్దలుకూడా-

కాని, రాధాయికి అదే ఎంతో తృప్తి. తనుకూడా కచ్చేరీపని చేశాననుకుని ఆనందిస్తాడు.

ఒకసారి వాళ్ళ నాన్నగారొచ్చి. తన కాగితాలనిండా కొన్ని గీతలువుండటం చూశారు. రాధాయి పనే అనుకున్నారు.

"ఏమోయ్! ఈ రాధాయి నా ఆఫీసు కాగితాలన్నీ పాడుచేస్తూ వుంటే వూరుకున్నావా?'' అని కేకవేశారు వాళ్లమ్మమీద నాన్నగారు.

రాధాయి బీరువావెనక నక్కి- ఇది వింటున్నాడు.

చప్పున పైకివచ్చాడు రాధాయి.

"లేదు నాన్నా! నేనుకూడా కచ్చేరీపని చేశాను!'' అన్నాడు.

రాధాయి అంటే మరి వాళ్ల నాన్నగారికి ఎంతో యిష్టం!

అంచేత రాధాయి ఇల్లా చెప్ప గానే, ఒక్కసారి పట్టలేక నవ్వారు వాళ్ల నాన్నగారు.

భోజనం చేస్తున్నప్పుడు- రాధాయి నాన్నగారి పక్కనే కూర్చుని. నాన్నగారు ఎల్లా భోజ నంచేస్తే సరిగ్గా తనూ అల్లానే చేస్తాడు

భోజనంచేస్తూ నాన్నగారు అమ్మతో ఇల్లా అన్నారు. "రాధా యికి వెంటనే అక్షరాభ్యాసం చేసెయ్యాలి'' అని.

''అవును. మీ కాగితాలన్నీ తగలేస్తున్నాడుగా! అక్షరాభ్యా సం చేస్తే వెంటనే మిమ్మల్ని అందుకుంటాడు'' అంటూ నవ్వింది వాళ్లమ్మ.

రాధాయి అంతా వింటూనే వున్నాడు. కాని పెద్దమనిషిలాగ భోజనం చేస్తున్నాడు.

"అక్షరాభ్యాసం చేసే యీడు కూడా దాటిపోయింది. వాడికి రాతమీద బుద్ధివున్నప్పుడే అక్ష రాభ్యాసం చేయిస్తే మంచిది." అన్నారు నాన్నగారు.

"మా రాధాయిని కాన్వెంటులో చేర్పిస్తాను'' అన్నది వాళ్లమ్మ.

"కాన్వెంటూ వొద్దు—వల్లి కాడూ వద్దు. యింగ్లీషు ముక్కల్లో, తెనుగు కాస్తా మరిచిపోయి. నాతోకూడా యింగ్లీషు మాట్లాడడం ప్రారంభిస్తే గట్టి చిక్కు."

మంచి రోజుచూసి, అయ్యవారినీ, బ్రాహ్మణ్ణీ పిలిపించి రాధాయికి అక్షరాభ్యాసం చేశారు వాళ్ల నాన్నా అమ్మా. ఇది చూడటానికి నాన్నగారి స్నేహితులూ, అమ్మ స్నేహితులూ ఎంతో మంది వొచ్చారు.

వాళ్ళంతా చూస్తువుండగా, తను అక్షరాభ్యాసం చేసుకోవటం రాధాయికి ఎంత గర్వం।

రాజకుమారుడు లాగా ఠీవిగా కూర్చుని, బియ్యంలో ఓ న మాలు దిద్దాడు. చిన్న బంగారు పలకమీద చిన్న వెండిపుల్లతో అ ఆ లు రాశారు. వాళ్ల అయ్యవారి సహాయంతో. ఆ తర్వాత కొత్త పలకా, కొత్త బలపమూ పట్టుకుని మళ్ళీ అక్షరాలన్నీ రాశారు. అప్పుడు రాధాయి అను

కున్నాడు: నాన్నగారు కచ్చేరీ రాతకు ఇంతంత అక్షరాలు ఎందుకు రాయరూ. మరీ చిన్నవి రాయకపోతే! ఇంతంత అక్షరాలు రాస్తే ఎంత బావుంటాయి! అనుకున్నాడు.

రాధాయికి ఆనాడు ఎన్నో బహుమతులు వచ్చాయి. ఎంతో మంది మంచి పుస్తకాలు తెచ్చి యిచ్చారు. కొంతమంది 'బాల' పత్రికలు తెచ్చారు! ఆ 'బాల' పత్రికనిండా బొమ్మలే--కొన్ని కొన్ని బొమ్మలకు పెద్ద అక్షరాలు! ఆ రామూ సోమూ బొమ్మలు! సోము చెడ్డవాడు. రాము నిజంగా తనలాంటివాడు. అందుకే సోముకన్న రాము బొమ్మలే చూస్తాడు! బొమ్మలు చూస్తేనే తెలుస్తుంది! వాళ్లమ్మ ఒకనాడు చదివిచెప్పింది కూడాను! ఆ అక్షరాలన్నీ మరి తనే చదవటం వెంటనే నేర్చుకోవాలి.

ఎవరో 'పెద్దబాలశిక్ష' కూడా తెచ్చి యిచ్చారు! దాన్లో ఎంతెంత పెద అక్షరాలు! తనకు అయ్యావారు చెప్పిన అక్షరాలేవున్నాయి!

రాధాయి రోజూ అక్షరాలు దిద్దటం ప్రారంభించాడు. అయ్యావారు రోజూ వస్తారు. బడికి తీసుకువెళ్తారు. మళ్ళీ ఇంటికి దిగబెడ్తారు. అయ్యావారు ఎన్నో అక్షరాలు నేర్పారు!

కాని వెధవది – కొన్ని అక్షరాలు మరీ వొంకరగా వుంటాయి. అవి రాధాయి ఎంత దిద్దినా రాలేదు! మొట్టమొదట 'అ' అనే అక్షరం తనకు రాయడం వొచ్చిందనుకుని, చూడకుండా



రాస్తే, అది 'ా' ఇల్లా వచ్చింది! చాలామట్టుకు అక్షరాలు ఇల్లానే

వచ్చాయి. "అల్లాకాదు ఇల్లా రాయాలి" అని వాళ్లమ్మ చెప్తే, 'ఓహో ఇందులో ఏదో గమ్మత్తుంది' అనుకున్నాడు రాధాయి.

రాధాయికిప్పుడు అక్షరాలన్నీ వొచ్చేసినట్టే. అయితే ఒక్కక్షరం కొంచెం ఇబ్బంది పెట్టుతూ వుంది ఇంకా.

అది 'ఌ' అక్షరం. 'ఌ' రాయడంవొస్తే ౡ రాయడం సులభమే. ఒక దీర్ఘమేగా పెట్టాలి! కాని ఆ అక్షరం ఎన్ని సార్లు రాసినా అది 'ఒ' అయిపోతోంది! ఈ 'ఒ' అనే అక్షరం తనకు ఎప్పుడో వచ్చేసింది! మరి 'ఌ' ఎందుకు రాదూ?

'ఌ' ఎలారాయాలో వాళ్లమ్మ ఒకనాడు తనచేయి పట్టుకుని కూడా దిద్దించింది. రాధాయి చాలా సేపు దిద్దుకున్నాడు, వాళ్లమ్మ, చూడకుండా రాయమంది.

రాధాయి గుండె పీచు పీచుమంది మళ్ళీ. ఆ ఆలోచనలో ఇల్లాగే అనుకుని అక్షరం రాసి చూసుకున్నాడు. అది మళ్ళీ 'ఒ' అయింది!

"ఏమిట్రా మళ్ళీ 'ఒ' రాశావు 'ఌ' రాయమంటే-ఇంక నీ కే అక్షరం రాయడం రాదు. పో!" అంది వాళ్లమ్మకు చికాకు వేసి.

'ఋ' అనే అక్షరం రాయడం ఎంత సుళువు! ఏం లేదు: 'బ' రాయడం; దాన్ని 'బు' చేయడం. దాన్ని మరో బు చేయడం: అంటే 'బ' కి రెండు కొమ్ములు ఇస్తే సరి! ఋ ఐపోతుంది. అలాంటి కిటుకేదన్నా ఈ ఌ అక్షరానికికూడా వుంటే బాగుణ్ణు! చూడటానికి పాముపడగల్లేవుంది గాని అక్షరం చెయ్యి తిరగదు కద!

ఇంక దీన్ని ఇలా సాధిస్తే లాభం లేదు అనుకున్నాడు రాధాయి.

ఇంతలో వాళ్ల నాన్నగారున్నూ వచ్చారు.

"ఏంరా—రాధాయి! అక్షరాలన్నీ వొచ్చాయా?" అన్నారు తను భోజనం చేయగానే.

"వొచ్చేశాయండి నాన్నారూ!" అన్నాడు రాధాయి.

"ఏదీ రాయి?" అన్నారు నాన్నగారు.

రాధాయి ఒక్కొక్కటే రాసి చూపించాడు.

'ఞ' దగ్గరకొచ్చేసరికి రాధాయి గుండె పీచుపీచుమంది.

రాధాయి బాగా ఆలోచించాడు. అక్షరం తనకు చాతనైనట్టు రాశాడు. నాన్నగారికిచూపించాడు.

"ఏమిట్రా! 'ఞ' రాయమంటే 'ఒ' రాశావు." అన్నారు.

"'ఒ' కాదు నాన్నా! అది 'ఞ' మీరు తప్పుచూశారు! అహా! అలాక్కాదు పలకతిప్పి పట్టుకొండి!" అన్నాడు రాధాయి!

రాధాయి తెలివికి వాళ్ళ నాన్నగారు విరగపడి నవ్వుకున్నారు.


# అందచందాలు

- ఇంటికి పాపాయి అందం
- కంటికి కాటుక అందం
- అన్ని అందాలకు మించినది
- ముఖానికి కలరు కుంకుమ

ఆ- కలరు కుంకుమ

తయారుచేయు చోటు ఏది?

**టి. గురుస్వామి శెట్టి**

144, ఆదియప్పనాయక్ వీధి, జి. టి. మదరాసు.



# ప్రఖ్యాతిచెందిన వైద్యులు పిల్లల లివర్ వ్యాధులకు ఈ ప్రత్యేకౌషధమును నిర్ణయించి మంచి ఫలితములను పొందినారు.

ఒక డాక్టరు వ్రాసినది :—

“ బిడ్డల లివరు వ్యాధ్యులకు మీ ప్రత్యేకౌషధములను నాలుగు సంవత్సరములనుండి వాడుచున్నాను. మొదటి రెండు సంవత్సరములలో వాటి అనుభవమును, నమ్మకము నాకు చాలతక్కువ.

ఈ ప్రత్యేకౌషధములపై నా విశ్వాసము అధికమైన కొలది, ధారాళముగా, వాడి ఆశలు వదులుకొన్న స్థితులలోకూడ అద్భుతమైన ఫలితములు పొందినాను.

ఈ విధముగా ఈ ప్రాంతములలో వ్యాపించియున్న లివర్ వ్యాధినుండి అనేక జీవితములు రక్షింపబడినవి.



ముదిరిపోయిన లివరు రోగి

Jammi Venkataramanayya & Sons

జమ్మి వెంకటరమణయ్య అండు సన్స

8, శాలై వీధి, మైలాపూరు, మద్రాసు

టెలిఫోను నెం. 8139   పో. బా. నెం. 608

టెలిగ్రాం: ‘ లివర్ క్యూర్ ’ మద్రాసు

వ్యాధి ఆరంభస్థితి, ముదిరిన స్థితులలోకూడ ప్రత్యేకౌషధములు ఈయబడును

# అమ్మా! నేను రాను!

## "దా దా"

"మేం లేచింది మొదలు రోజస్తమానం ఆడుకుంటూనే వుంటాము. బంగారు కాంతులతో ధగ ధగ మెరిసే తెల్లవారు వెలుతురుతోటీ, వెండిలా వెలిగే చందమామతోటీ మేము ఆడుకుంటాము, నువ్వూ వస్తావా" అని మేఘాల్లోని పిల్లలు నన్ను పిలుస్తూ రమ్మంటున్నారమ్మా!

"కాని, మీదగ్గిర కొచ్చేందుకు ఏమెక్కి రానూ?"

* * *

"భూమి చివరికివచ్చి, ఆకాశంవేపు చేతులెత్తు—నిన్ను మేము పైకి లాగుతాము."

* * *

"ఇంటిదగ్గిర మా అమ్మ నాకోసం ఎదురుచూస్తూంటుంది! అమ్మని వదిలేసి నే నెలా రాగలను?"

* * *

అమ్మా! నామాటలు విని ఆ పిల్లలందరూ నవ్వి మేఘాల్లో తేలిపోతూ వెళ్లిపోతారు.

అమ్మా! వాళ్లాడేఆటలకంటే, నాకు ఎంతోమంచి ఆట వచ్చు. నేను... నేను... మేఘ మనుకో! మరి నువ్వూ... నువ్వూ... చందమామ!

నా రెండు చేతులతోటీ నీ ముఖం మూసేస్తాను! మన ఇంటి కప్పు, ఆ నీలాకాశం అనుకుందాము!...



అమ్మా! కెరటాలమీద ఉన్న పిల్లలు నన్ను రమ్మంటున్నారు!

"మేం పొద్దున్నుంచి రాత్రి వరకూ హాయిగా పాడుకుంటాము; అంతే కాదు. అప్పుడప్పుడు అలా అలా కెరటాల మీద కూర్చుని తేలిపోతాము. కాని మేం ఎక్కడెక్కడికి వెడతామో మాకుమాత్రం తెలియదు. నువ్వూ వస్తావా!" అని, నన్నుకూడా రమ్మంటున్నారమ్మా!

"సరే వస్తానుకాని, మిమ్మల్ని ఎలాగ కలుసుకోడం?"

"ఆతీరం అంచుదాకావచ్చి, గట్టిగా కళ్ళుమూసుకుని నిలబడు. అంతే! నువ్వు కెరటాలమీదుగా మా దగ్గిరకి వచ్చేస్తావు."

"సాయంత్రం పడేసరికల్లా మా అమ్మకి నే నింటిదగ్గరుండాలి–అమ్మనొదిలి ఎలా రాను!"


అమ్మా! ఆ పిల్లలందరూ నాట్యంచేస్తూ ముసి ముసి నవ్వులతో వెళ్ళిపోతున్నారు!

కాని, అమ్మా! వాళ్ళాడుకునే ఆటలకంటే మంచి ఆట నాకొచ్చును. నేను... నేను... కెరటాలు. మరి నువ్వు...నువ్వు ...తీరానివి. నేను దొర్లుకుంటూ దొర్లుకుంటూవచ్చి, నీ వళ్ళో, కిల కిల నవ్వుతూ వాలుతా!

అప్పుడు, మనిద్దరం ఎక్కడున్నామో ఎవ్వరికీ తెలియదు కదూ!

"రవీంద్రుడు"

# 'బడి' అంటే ఏది?



కోపిష్టి గురువు. ఈయనకి ఇట్టే కోపం వస్తుంది, ముక్కు చివర్ని పొంచి ఉండి. ఒకరి తరువాత ఒకర్ని పిల్లల్ని ఊరికే చితకకొట్టడమే! ఈ క్లాసులో చదువేమిటి, యమధర్మరాజు దగ్గిర? ఈబడి నరకం.

* * *

పనికిరాని పిల్లలు. చూడండి, ఒకడు పాగా లాగుతాడు; ఒకడు బెత్తం లాగుతాడు; మిగిలిన వాళ్లు బాండు వాయిస్తున్నారు. ఇది పశువుల సంతా? పిచ్చి ఆసుపత్రా? ఈ బడిలో చదువుకూడాను!

* * *

మంచి మేస్టరు; మంచి పిల్లలు. ఎంత బాగా, సరదాగా, ఉత్సాహంగా చెప్తున్నాడో! బొమ్మల్లాగ కదలకుండా పిల్లలు ఎంత చల్లగా నిదానంగా వింటున్నారో!

ఇదీ బడి,

ఈ పై మూడుబడులలో మీకు నచ్చినది మూడో బొమ్మలో వున్న బడే కదూ?

బొమ్మలు, రచన: దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి (బుజ్జాయి).


# పట్నం

# బావ



పొట్టిబావ

బావా బావా పట్నం బావ
కట్నాలేమి తెచ్చావు ?
కట్నాలేమి తెచ్చావు—నీ
వుట్టినె చూడ వచ్చావ ?
వస్తానని నీ వుత్తరమేస్తే
ముస్తాబై నే మురిసాను—
బస్తీనుండి వస్తున్నావు
వస్తువులేమి తెచ్చావు ?
బ్రోచి పిన్నులే కొన్నావా
వాచీ గొలుసూ తెచ్చావా
బీచికి వెళ్లేటందుకు మంచి
ప్యూజీ సిల్కులు తెచ్చావా ?
తెచ్చినవన్నీ యిస్తే నాకు
అచ్చు బొమ్మలా గొస్తాను
ముచ్చటగా మనమిద్దరమూను
ముచ్చటలాడూ కుందాము.




# అష్ట దిక్కులు

రచన: జొన్నాడ సావిత్రమ్మ

దిక్కులు ఎన్నియొ అన్నయ్యా
చక్కగ చెప్పుము అన్నయ్యా
దిక్కులు నాలుగు చెల్లాయీ
చెప్పెద వినుమో చెల్లాయీ
అదిగో సూర్యుడు ఉదయించే
ఇదిగో పద్మము వికసించే
నిలువుము సూర్యున కెదురుగ, నీ
కెదురుగ నున్నది తూరుపుగా
వెనుకను ఉన్నది పడమరగా
చేతులు రెండును చాచమ్మా
కుడివైపున్నది దక్షిణమే
ఎడమకు ఉన్నది ఉత్తరమే—

* * *

మూలలు ఎన్నియొ అన్నయ్యా
చక్కగ చెప్పుము అన్నయ్యా
మూలలు నాలుగు చెల్లాయీ
చెప్పెద వినుమో చెల్లాయీ
ఇదిగో ఇదిగో ఈశాన్యం
ఉత్తర తూర్పుల సంయోగం ;—

అదిగో అదిగో ఆగ్నేయం
దక్షిణ తూర్పుల సంయోగం ;—
అల్లదె నైరృతి చెల్లాయీ
దక్షిణ పడమర కలిసాయీ ;—
ఉత్తర పడమర మధ్యాన్ని
బాగుగ చూడుము వాయవ్యం ;—
చక్కగ చెప్పితి వన్నయ్యా
నేనును నేర్చితి నన్నయ్యా.

## ఈ లెక్క నీవుచెప్పు చూద్దాం

ఒక అంకె కోరుకో ...
కోరుకున్నన్ని అప్పుతెచ్చుకో ...
మొత్తం చేసుకో ...
నేను యిచ్చినవి 30
మొత్తం చేసుకో ...
సగము దేవుడికిమ్ము ...
అప్పుతెచ్చినవి తిరిగియిమ్ము ...
నీదగ్గర మిగిలినవి నేను
చెప్పనా... 15

నీవు చెప్పు చూదాం.

రచన : జి. ఎస్. వి. సరోజనమ్మ.


# న్యూటన్ కథ

రచన:
మునుగంటి
శ్రీరామమూర్తి
కాకినాడ.

అనగా అనగా ఒక వూరు. ఆ ఊరు ఎక్కడవుందో తెలుసా? 'సీమదేశ మంటాం!' ఆ దేశంలో వుంది. అక్కడ మన ముత్తాతల నాటి కాలంలో ఒక పిల్లాడుండేవాడు. అతని పేరు న్యూటన్.

న్యూటన్ చాలా తెలివైన వాడూ, మంచి పిల్ల వాడూను. ఇంటి దగ్గిర ఎప్పుడూ చెల్లెళ్ళని, తమ్ముళ్ళనీ కొట్టేవాడు కాదు. బళ్లో తోడిపిల్లలతో ఎప్పుడూ దెబ్బలాడేవాడు కాదు. జాగ్రత్తగా గురువుగారు చెప్పిన పాఠాల్ని వల్లిస్తూ, బాగా చదువుకొనే వాడు. ఎప్పుడూ ఆకాశంవైపు చూస్తూ 'సూర్యుడల్లాగ యెందుకు ప్రయాణం చేస్తున్నాడు? తూర్పు దిక్కున రోజూ ప్రొద్దున్నే ఎందుకు ఉదయించాలి? పడమట్నే సాయంత్రం యెందుకు అస్తమించాలి? ఆవిధంగా ఆకాశంమీద ప్రయాణం చేస్తున్నప్పుడు ఆకాశం మీదనుంచి ఎందుకు క్రింద పడి పోవడం లేదు? సూర్యుణ్ణి ఆకాశం మీదనుంచి పడిపోకుండ వాళ్ళమ్మ కాపాడుతుందా? ఐతే వాళ్ళమ్మ ఎవరు? ఆమె ఏం చేస్తుంది?' అని ఎప్పుడూ ఈ విధంగా ఆలోచిస్తూ వుండేవాడట. పెద్దవాడైన తర్వాతకూడ అతనికి ఆలోచన తగ్గలేదు.

ఇల్లా చాలారోజులుగడిచేయి. ఒకరోజున అతడు ఒక్కడే ఒక రేగుచెట్టుక్రింద కూర్చొని, మళ్లీ దానినిగురించే ఆలోచిస్తున్నాడు. మనం ఆలోచించేటప్పుడు సాధారణంగా బుర్ర పైకెత్తి చూస్తాంటాంకదూ! అల్లాగే అతడుకూడ చెట్టుకేసిచూస్తూ ఆలోచిస్తూన్నాడట. ఇంతలో ఆచెట్టునుంచి ఒక పెద్ద ముగ్గిన రేగుపండు నేలమీద పడింది. మనమైతే ఏంచేస్తామో! కాని న్యూటన్‌కు యింకో సందేహం వచ్చింది. ముగ్గినపండు పైకి పోకుండా క్రిందికి ఎందుకు పడిందీ అని! చాలాసేపు ఆలోచించాడు ఆలోచించాడు. చివరకి భూమి ఆ పండుని తన వైపుకి లాక్కుంటదని నిర్ణయించుకున్నాడు. దాని



కతడు ఎంత సతోషించాడనుకున్నారు? చాలా సంతోషించాడు. ఎందు చేతంటే అతడు అన్నాళ్ళ నుంచి ఆలోచిస్తూన్న ప్రశ్న కి జవాబు అందులోనే వుంది కనక!

చెట్టు ఎక్కడ్నించి పుట్టింది? భూమిలో నుంచి పుట్టింది. అందు చేత చెట్టుకి అమ్మ భూమి. చెట్టుకి పిల్ల రేగుపండు. కాబట్టి భూమి రేగుపండుకి అమ్మమ్మ. అమ్మమ్మలకు మనుమరాళ్ళమీద ప్రేమ ఉండదా? ఎందుకుండదు? అంచేతనే భూమి తన మనుమరాల్ని దగ్గరకు లాక్కుంది.

అల్లాగ్గా మన సూర్యుడికికూడ తల్లి ఉంది. సూర్యుడికి చాలా మంది పిల్లలున్నారు. పాపం! సూర్యుడు తన పిల్లలదగ్గిరికి వెళ్ళిపోదామని ప్రయత్నిస్తూంటాడుట. కాని అతని తల్లి 'నా దగ్గిర్నించి వెళ్ళిపోకు!' అని అంటుంది. పిల్లలు తమవైపుకి, తల్లి తనవైపుకీ, ఇల్లా లాగుతూంటే. ఎవర్నీ వదిలించుకోలేక సూర్యుడు అల్లాగే, ఆకాశంమీదతల్లికీ, పిల్లలకీ మధ్య తిరుగుతూ వుంటాడుట.

ఇలాగ సూర్యుడికీ, భూమికీ, మధ్య ఆకర్షణశక్తి వుందని మొట్టమొదట తెల్సికొన్నవారెవరో తెలుసా? న్యూటన్.

ఆలోచిస్తే మనం మాత్రం ఎన్ని కనిపెట్టలేము!

# వచ్చెను శివరాత్రి!


వచ్చెను శివరాత్రీ
భక్తితో మనమంతా
శివునిపూజానూ
చేసీవస్తామా !

వచ్చెను శివరాత్రీ
వరుసతో మనమంతా
గౌరీశంకరులా
గాంచీవస్తామా !

వచ్చెను శివరాత్రీ
హెచ్చుగ మనమంతా
ఒక్కప్రొద్దులనూ
చక్కగ ఉందామా !

దేవుడిగుళ్లోనూ
దేవునిపాటలనూ
పాడీమనమంతా
భక్తులమౌదామా !!!

రచయిత : ధూళిపాళ్ల కృష్ణమూర్తి, గన్నవరం.



# తులశమ్మ మా ఇంట !

రచన : మానేపల్లి సంగమేశ్వరరావు,
మచిలీపట్నం, చిలకలపూడి.

తులశమ్మ మాయింట తొలిదేవతమ్మ,
పదియారు కళల మా బంగారులక్ష్మి ॥

మాతల్లి చల్లని మహికల్పవల్లీ,
మాతండ్రి గంధర్వ మహరాజవారు ॥

చిలకల్లుమాతోటి చెల్లెళ్లుకాగ,
హంసలే చక్కనీ అక్కయలు మాకు ॥

మాఅన్నదమ్ముల్లు మల్లెమొగ్గల్లూ,
మౌక్తికారాసులూ మందారవళులు ॥

ముగ్గుల్లో ముత్యాలు ముంచెత్తినాము,
పగడాలు పూవుల్లు పరిపించినాము ॥

పచ్చనీ సంక్రాంతి పాలల్లో తడిసీ,
వచ్చింది మాయింటి వాకిట్లోకమ్మా ॥

మాఅత్తవారిల్లు మామిళ్ల నీడా,
నీడలో మాబావ మేడేసినాడే ॥

తెలుగు తల్లీ మాకు ఇలవేల్పుయౌటా,
దీవించిపెంచినది దేవతలుమెచ్చా ॥

# బాలా! నీకు తెలియునా?

- హిందూదేశపు జనాభా 40,00,00,000.
- వైద్యశాల మొదట నిర్మించినవాడు అశోక చక్రవర్తి.
- భూమియొక్క వయస్సు సుమారు 20 కోట్ల సంవత్సరములని భూగోళ శాస్త్రజ్ఞులు అంచనా వేసినారు.
- ఆఫ్రికాలోని విక్టోరియా జలపాతము ధ్వని సుమారు 7 మైళ్ళ వరకు వినిపిస్తుంది.
- న్యూయార్కు (అమెరికా) పట్టణంలో రమారమి 35 భవనాలు ఒక్కొక్కటి 500 అడుగుల ఎత్తునుమించి వున్నాయి. అన్నిటికన్నా ఎత్తైనది సామ్రాజ్య భవనం. దాని ఎత్తు 1,248 అడుగులు.
- తిమింగిలం 500 సంవత్సరాల వరకు బ్రతుకుతుంది.
- ఒంటె దినమునకు సగటున 100 మైళ్లు ప్రయాణము చేయగలదు.
- హిందూదేశపు మిల్లులలో సుమారు 20 లక్షల మంది పని చేస్తున్నారు.
- హిందూ దేశంలో నూటికి 75 మందికి వ్యవసాయవృత్తే ఆధారం.
- హిందూ దేశంలో ఒక ఎకరం భూమిమీద రాబడి 56 రూపాయలు; ఇంగ్లాండు దేశంలో 225 రూపాయలు!

'బడిపంతులు'

# మన దేశంలోని భాషలు

మన భారతదేశంలో అందరం ఒకేభాష మాట్లాడు చున్నామా? లేదు హిందూస్తానీ, బెంగాలీ, మహారాష్ట్ర, తెలుగు, అరవం, కన్నడం – ఇలాగ ఎన్నోభాషలు మాట్లాడు తున్నాం.

మనదేశంలో యీ యీ భాషలు ఎంతమంది మాట్లాడు చున్నారో కొన్ని ముఖ్యమైనవి యీ దిగువనవేశాం చూడండి.

| వరుస సంఖ్య | భాష పేరు | మాట్లాడువారు |
|---|---|---|
| 1 | హిందూస్థానీ | 17,23,97,409 |
| 2 | బెంగాలీ | 5,34,68,460 |
| 3 | తెలుగు | 2,63,[illegible]3,41 |
| 4 | మహారాష్ట్రం | 2,13,61,399 |
| 5 | అరవం | 2.04.11 652 |
| 6 | గుజరాతీ | 1,32.78,720 |
| 7 | కన్నడం | 1,22.06,380 |

# లొడలొడగారు

రచన : పెనుమాక రాధాకృష్ణమూర్తి

నా కెప్పుడూ మా అమ్మ నొదిలి పెట్టే అలవాటు లేదు. ఆ రోజుల్లో మా యింటికి ప్రతిరోజూ ఒకామె వచ్చేది. నాకు ఆడవాళ్ల కబుర్లంటే సరదా. అందుచేత మాఅమ్మ ప్రక్కనే కూర్చుండే వాడిని. వాళ్ళ కబుర్లు వినటానికి వీలుంటుంది గదా అని. ఆమె అర్థం కాకుండా లొడలొడ మాట్లాడుతుంది. అప్పటికి నాకసలు ఆమె పేరు తెలియదు.

ఒకరోజున మా అమ్మవాళ్ల భోజనాలు ఆలశ్యంగా అయినాయి. మానాన్న ఆఫీసుకు వెళ్లారు. మాఅమ్మ దొడ్లో పని చేసుకొంటున్నది. అప్పుడు ఆమె వాడుకచొప్పున వరండాలోకి వచ్చి, "అబ్బాయి మీ అమ్మ లేదూ" అని అడిగింది. నేను ఉన్నదని చెప్పాను. నేను వచ్చానని చెప్పమని మళ్లీ అన్నది. నాకు పేరు తెలియకపోవడంవల్ల "అమ్మా! లొడలొడగారొచ్చారే" అని లోపలికివెళ్లి అన్నాను. మాఅమ్మకు కోపం వచ్చింది. "అట్లా పెద్దవారిని అనవచ్చా! పైగా ఆమె యెదుట అంటే బాగుంటుందా! నాన్నగారు రానీయి నీపంత పడతాను" అని కేకలేసింది.

నేను మారు మాటాడకుండా ఆడుకోటానికి పరుగువేసాను. సాయంత్రం ఆడుకుం తరువాత ఇంటికి వచ్చాను. మానాన్న రోజూ బిస్కతులు తెచ్చే అలవాటు ఆ రోజున తీసుకురాకపోగా ఇంటికి రాగానే ఇంకెప్పుడయినా ఒకరిని ఎగతాళిచేస్తావా అని వీపుమీద బాదారు. ఆనాటి నుంచీ ఎవరినన్నా ఎగతాళిచేస్తే ఒట్టు!

# నా చిన్నతనంలో

## చందమామలో మచ్చ

రచన: వారణాశి సుబ్రహ్మణ్యం

నేను మీ అంత వున్నప్పుడు — నా చిన్నప్పుడు — జరిగినవన్నీ నాకు యిప్పటికీ యెంతో జ్ఞాపకం!! నా చిన్నతనం నిన్ననో మొన్ననో జరిగినట్లుగా వుంటుంది. మీరందరూ పెద్దవాళ్ళయిన తర్వాత, మీకు కూడా మీ చిన్నతనం సంగతులన్నీ యిలాగే జ్ఞాపకం వొస్తూ వుంటాయి.

ఎన్నెన్ని చిత్రాలు జరిగా యనుకున్నారు?? చెబుతానుగా వరసాగ్గా!!

మా పెద్ద మండువా యిల్లూ, మేడా, దొడ్లో జామిచెట్టూ, మా యింటి యెదురుగా, అరుగుల యింట్లో వున్న పద్మావతి అనే పిల్లని అమ్మాయీ, వాళ్ళన్నయ్య క్రిష్ణమూర్తీ, అతని పైవేటు మేష్టరుగారూ, మా యింట్లో కుక్కపిల్ల "టైగరూ," మా బండీ తోలే రామన్నా, యింకా యెన్నెన్నో జ్ఞాపకం వొస్తూ వుంటాయి.

నేను అప్పుడు ఫస్టుఫారంలో వున్నాను. క్రిష్ణమూర్తి నాకంటె యింకో రెండు క్లాసులు యెక్కువ. పద్మావతి నాలుగో క్లాసు.

ఒకరోజున......

రాత్రి — ఆకాశంలో చందమామ నిండుగా వున్నాడు బంగారంపళ్ళెంలాగా. చల్లని వెన్నెల. అలా చంద్రుడు నిండుగా వున్న రాత్రిని యేమంటారో తెలుసునా? "పూర్ణిమ రాత్రి" అంటారు. చంద్రుడు అలా నిండుగా, గుండ్రంగా, మనకి నెలకొకసారి కనిపిస్తాడు.

సరేనా, ... నేను అప్పుడే అన్నంతిని మా గేటు ముందు నిల్చున్నాను. చెప్పానుగా మా యిల్లు సంగతి? పెద్దమండువా, మేడా, చుట్టూ పెద్దప్రహారీ గోడా, ఎత్తయిన యినుపచువ్వల గేటూ. ఆరోడ్డుమీద, మాదే పెద్దయిల్లు.

పద్మావతి వాళ్ళ అరుగమీద నించుని, చంకలో వున్న



నేను అప్పుడే అన్నం తిని మా గేటుముందు నిల్చున్నాను.

యికి బువ్వ పెడుతోంది, చంద
మామని చూపిస్తూ.

"చందమామ రావే జాబిల్లి రావే" అని పాడుతూ ముద్దలు పెడుతోంది, పాపాయికి.

"చూడూ రాజా. ఆ చందమామలో ముసిలమ్మ యెప్పుడూ అలానే కూర్చుంటుందే, యేడుస్తూ."

అరుగుమీద కూర్చున్నవాళ్లమ్మ "ఒసేవ్ పద్మ, ఆ ముసలమ్మ పత్తి వొడుకు చూపుందేవ్" అంది

ఇంతలోనే క్రిష్ణమూర్తిగూడా అరుగుమీదికి వొచ్చాడు. నేనూ వాళ్ళ అరుగుమీద అమ్మమ్మ గారిపక్కన కూర్చున్నాను. క్రిష్ణమూర్తి "అమ్మమ్మోయ్. అందులో అసలు ముసలమ్మ లేదు," అన్నాడు.

"కిష్టుడూ, అందులో జింక ఉందిటగా?" అని నేనన్నాను.

చందమామలో జింక వుందని నాకు మా బండీరాముడు చెప్పాడు. క్రిష్ణమూర్తి "లేదురా రాజా! అందులో, ఆనల్లగా కనిపించేదంతా కొండలు." అన్నాడు.

ఆపళంగా పద్మావతి "ఛీ! అన్నీ అబద్ధాలు! వీడన్నీ యిట్లాగే అంటాడురా, రాజా. మొన్ననే, ఆచిక్కుడు మొక్కఆకులు వాలి వుంటేనే, అవేమో నిద్రపోతున్నాయన్నాడు."

ఇలాగే మాట్లాడ్తుంది పద్మావతి. ఎక్కిరిస్తూ, కొక్కిరిస్తూ మాట్లాడేది.

కాని క్రిష్ణమూర్తి వాళ్ళ క్లాసులో ఫస్టు. స్కూలు పుస్తకాలే కాకుండా యింకా యింకా యెన్నో చదివేవాడు! చాలా చాలా సంగతులు తెలుసు- అందుకని అతనంటే నాకు అంత గౌరవం.

పద్మావతి అలా వెటకారం చేసిందా, అతనేమో యేమీ అనలేదు. "మా మేష్టారు చెప్పారు పద్మీ. అదుగోఆయనా వొస్తున్నారు. కావాలంటే అడుగు." అనిమాత్రం అన్నాడు.

ఇంతలోకే ప్రైవేటు మేష్టరు గారు వొచ్చారు. ఎంత మంచి వారనుకున్నారు? మేము అడిగినవన్నీ చెప్పేవారు. ఎన్నడూ విసుక్కునే వారుకారు.

పద్మావతి, గుమ్మంలో అడ్డం నిల్చుని, "మేష్టారూ, చందమామలో ముసిలమ్మ లేదూ?" అని నిలవేసి అడిగింది. ఉత్తగడుగ్గాయపిల్ల! వాళ్ళ అమ్మకి తప్ప మరెవరికీ భయపడేదికాదు.

మేష్టారు, "లేదమ్మా. అవి కొండలు!" అన్నారు.

ఆ కొండలు బెజవాడ కొండల్లాటివేనా? అని అడిగాను. మేష్టారు అంతకన్నగూడా చాలా పెద్దవన్నారు. క్రిష్ణమూర్తి చంద్రుళ్ళో కొండలు "హిమాలయ" పర్వతాలకన్న యెత్తయినవా? అనడిగాడు.

పద్మావతి "మేష్టారూ, ఆహిమాలయ పర్వతాలు యెక్కడున్నాయండీ?" అనిఅడిగింది. మీకు తెలుసూ? మన దేశానికి ఉత్తరంగా వున్నాయి. ప్రపంచంలోకల్లా యెత్తయిన కొండలు. నేను మా జాగ్రఫీ పుస్తకంలో చదివాను. పద్మావతికి నే

యీసంగతి చెప్పేసరికి వుక్రోషం వచ్చింది. "తెలుసు లెండి!" అంటూ లోపలికివెళ్ళి పుస్తకాలు పట్టుకొచ్చింది.

అందరం హాల్లో తివాసీమీద కూర్చున్నాం.

"మేష్టారూ, చంద్రుళ్లో కొండలు వున్నాయని మనకు యెలా తెలుసూ?" అనిఅడిగాను.

మేష్టారు 'ఎప్పుడేనా భూతద్దం చూశావ్ రాజా?' అని అడిగారు.

నేను జవాబు చెప్పేలోగానే, పద్మావతి అడ్డంవొచ్చింది. 'చూశానండి మేష్టారూ. అన్నయ్య దగ్గరుంది. సూర్యుడి వెలుతురు అందులోంచి పడితే వొళ్లు కాలి పోతుంది. మొన్ననే, వాళ్ళ రామం, నానల్లపరికిణీ కాల్చేశాడండి! రెండు బొత్తలు పడ్డాయ్' అంది.

మేష్టరుగారు నవ్వుతూ అడిగారు.

'సరేగాని, అది ఇంకా ఎందుకన్నా పనికొస్తుం దేమో తెలుసు పద్మా'

నేనూ, పద్మా ఒక్కసారి అన్నాం.

'చిన్న చిన్న అక్షరాలు పెద్దవిగా కనిపిస్తాయి'

'సరేనా. ఇలాటి పెద్ద పెద్ద భూతద్దాల్లాటివి ఎత్తయిన కొండలమీది నుంచి చూస్తే, ఆ చంద్రుల్లో మచ్చ యెంతో పెద్దదిగా కనిపిస్తుంది. అప్పుడేమో, చంద్రుల్లో కొండలూ, పెద్ద పెద్ద గోతులూ, కనిపిస్తాయి.'

ఆ గోతులు పెద్దపెద్ద నూతుల్లాగా వుంటాయని చెప్పారు మేష్టారు.

పద్మావతి 'మేష్టారూ, అలాగయితే అలాటి భూతద్దం తెప్పించి మన కొండమీది నుంచి చూదాం. ఉండండి నాన్ననడుగుతా' అంటూ అప్పుడే షికారు నుంచి వొస్తున్న వాళ్ళ నాన్నగారిని వీథిలోనే అడిగింది. ఆయన పొట్ట చెక్కలయేటట్టు నవ్వుతూ—

'ఓసి వెర్రి సన్నాసీ. ఆ భూతద్దం కొన్నికోట్ల రూపాయలుంటుంది. పట్నం వెళ్ళినప్పుడు చూస్తాంగదూ?' అంటూ లోపలికి వెళ్లా.